మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

వరంగల్ సభకు పోటెత్తిన జనమే నిదర్శనం

కేసీఆర్ ప్రసంగానికి హాజరైన ప్రజల స్పందన అద్భుతం

విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు: కేటీఆర్

జిమ్‌లో కసరత్తు చేస్తూ గాయపడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభా వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తేతెలంగాణ): 'తెలంగాణలో తిరిగి బీఆర్ఎస్‌దే అధికారం.. చరిత్రాత్మక వరంగల్ సభకు లక్షలాదిగా పోటెత్తిన జనమే ఇందుకు నిదర్శనం.. ఇదే ప్రజలిచ్చిన రజతోత్సవ సందేశం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలు, దిగ్విజయంగా నిర్వహించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు సోమవారం ఒక ప్రకటనలో కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. దేశ రాజకీయాల్లో అతిపెద్ద బహిరంగ సభల్లో ఒకటిగా రజోత్సవ వేడుక నిలిచిపోనున్నదని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రజాబలాన్ని చాటడం గర్వకారణమన్నారు. ఈ సభ స్ఫూర్తితో భవిష్యత్‌లో రేవంత్ సర్కారు అరాచకాలను అడుగడుగునా ఎండగడతామని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన లక్షలాది మంది కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా విని అచంచలమైన విశ్వాసాన్ని చూపారని కొనియాడారు. ట్రాఫిక్ నిర్వహణలో పోలీసులు విఫలమైనప్పటికీ, అనేక ఆటంకాలు కల్పించినప్పటికీ లక్షల మంది సమయానికి ముందే ప్రాంగణానికి చేరుకోవడం వారి నిబద్ధతను తెలియజేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సభ ఆరంభం మాత్రమేనని అన్నారు. 'కేసీఆర్ నేనే ముందుండి పోరాడతానని ప్రకటించారని, ఈ పరిస్థితుల్లో పార్టీ క్యాడర్ భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చామని, ఇకపై ప్రజావ్యతిరేక నిర్ణయాల మీద వెంటాడుతామని ప్రతినబూనారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సర్కారు వైఫల్యాలు, దోపిడీని మీడియా ద్వారా ఎండగట్టాలని ఉద్బోధించారు.

బీఆర్ఎస్ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్..

కేటీఆర్ సోమవారం పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు కృషిచేసిన వారికి, ముఖ్యంగా వరంగల్ జిల్లా పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులకు పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. నెలరోజులుగా నాయకులు, కార్యకర్తలు నిర్విరామంగా శ్రమించడంతోనే సభ జయప్రదమైందని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ప్రసంగాన్ని, సభలోని జన స్పందనను ప్రపంచానికి వినిపించిన మీడియా, సోషల్ మీడియాకు ధన్యవాదాలు చెప్పారు.

జిమ్‌లో కేటీఆర్‌కు స్వల్ప గాయం

జిమ్‌లో కసరత్తు చేస్తూ కేటీఆర్ సోమవారం గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా వెన్నుపూసలో స్వల్పంగా గాయమైందని తెలిపారు. డాక్టర్లు కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని సూచించారని వెల్లడించారు. త్వరలోనే కోలుకొని ప్రజల ముందుకు వస్తానని ఆశాభావం వ్యక్తంచేశారు. కాగా, ఆయన త్వరగా కోలుకొని యథావిధిగా ప్రజాసేవలో నిమగ్నం కావాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆకాంక్షించారు. సోషల్ మీడియాలో వేలమంది నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ సాధ్యమైనంత తొందరలో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తూ పోస్టులు పెట్టారు.

ప్రజావ్యతిరేకతకు

అద్దంపట్టిన సభ

సభ సక్సెస్‌ను జీర్ణించుకోలేని కాంగ్రెస్

కేసీఆర్ రావాలని జనం కోరుతున్నరు

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఏప్రిల్ 28: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకతకు బీఆర్ఎస్ రజతోత్సవ సభ అద్దంపట్టిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభ విజయవంతం కావడంపై కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతున్నదని, అందుకే మంత్రులు, ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా వాగుతున్నారని మండిపడ్డారు. సభకు లక్షలాదిగా జనం తరలిరావడం, కేసీఆరే మళ్లీ రావాలి.. అంటూ నినాదాలు చేస్తూ నిండు మనసుతో మద్దతు తెలిపారని పేర్కొన్నారు. దీనిని చూసి జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు ఆగమేఘాలపై సభ సక్సెస్ కాలేదని మీడియాతో మాట్లాడుతూ స్వీయ ఆనందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వాళ్లు కళ్లుండి వాస్తవాన్ని చూడలేకపోతున్నారని పేర్కొన్నారు. 17 నెలల పాలనలో కాంగ్రెస్ పార్టీపై, సీఎం రేవంత్‌రెడ్డిపై వచ్చిన వ్యతిరేకత.. సభకొచ్చిన లక్షలాది ప్రజల్లో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోలీసులను ఇతర యంత్రాంగాన్ని వాడుకుని సభను అడ్డుకునే కుట్రలు చేయాలని చూశారని తెలిపారు. ఆ కుట్రల వల్ల బయట రోడ్లపై లక్షలాది మంది ప్రజలు ఉండిపోయారని తెలిపారు. కేసీఆర్ కోసం రాష్ట్ర నలుమూలల నుంచి సునామీలా సభకు తరలివచ్చారని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి సుమారు 40 వేల మంది ఎల్కతుర్తి సభకు తరలివెళ్లినట్టు తెలిపారు.

లోకం పోకడ



జవాబు ఇవ్వలేకే మంత్రులు కారుకూతలు

బీఆర్ఎస్ సభతో సర్కారుకు చెంపపెట్టు

యావత్ తెలంగాణ అంతా కేసీఆర్ వెంటే

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తేతెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభలో అంశాలవారీగా కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకే మంత్రులు కారుకూతలు కూస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎల్కతుర్తి సభ విజయవంతం కావడం కాంగ్రెస్ సర్కారుకు చెంపపెట్టు అని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యం, అబద్ధపు హామీలు, దౌర్జన్యాలు పెరిగిపోయిన నేపథ్యంలోనే సభకు అంచనాలకు మించి ప్రజలు తరలివచ్చారని తెలిపారు. 17 నెలల్లో తెలంగాణను అన్నిరంగాల్లో ఆగం చేసిన కాంగ్రెస్‌ను కేసీఆర్ ఓరుగల్లు వేదికగా ఎండగట్టారని తెలిపారు. సభకు ఎన్ని ఆటంకాలు సృష్టించినా జనం ముందు సర్కారు ఆటలు సాగలేదని స్పష్టంచేశారు. ఈ సభతో యావత్ తెలంగాణ కేసీఆర్ వెన్నంటి ఉన్నదనే విషయం రుజువైందని తెలిపారు. ఆహోరాత్రులు కష్టపడి సభను జయప్రదం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సభకు పోలీసుల పైసావసూల్!

ఎన్నడూలేనివిధంగా యూజర్ చార్జీలు తీసుకున్నారు ● ఇప్పటివరకు ఏ సభకు ఇలా జరుగలేదు

- **ట్రాఫిక్ జామ్ అయ్యేలా చేశారు**
- **ఆదివారం ఆర్టీఏలు డ్యూటీ చేశారు**
- **ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**
- **ప్రజల గుండెల్లో కేసీఆర్‌కు చెరగని ముద్ర**
- **ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్**
- **చరిత్రాత్మక సభల వేదిక వరంగల్: పెద్ది**

వరంగల్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మహాసభ నిర్వహణకు పోలీసులు బీఆర్ఎస్ నుంచి యూజర్ చార్జీలు వసూలు చేశారని తెలిపారు. ఇప్పటివరకు ఏ సభకూ ఇలా జరుగలేదని గుర్తుచేశారు. మహాసభ కోసం 2వేల మంది పోలీసులను కేటాయిస్తామని చెప్పి కనీసం 200 మందిని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రజతోత్సవ మహాసభ నిర్వహణ అనుమతికి దరఖాస్తు చేసిన తర్వాత 10 రోజుల వరకు ఇవ్వలేదని, కోర్టు జోక్యంతోనే అనుమతి వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ మహాసభను ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతంచేశారని తెలిపారు. పోలీసుల వైఫల్యం కారణంగానే ట్రాఫిక్‌జామ్ అయ్యిందని, బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై ఉండి ట్రాఫిక్ క్లియర్ చేయాల్సి వచ్చిందని చెప్పారు. సాధారణ రోజుల్లోనే సరిగా డ్యూటీలు చేయని ఆర్టీఏ అధికారులు బీఆర్ఎస్ సభకు వచ్చే వాహనాలను అడ్డుకునేందుకు ఆదివారం రోడ్లపైకి వచ్చి వీడియోలు తీశారని తెలిపారు. బీఆర్ఎస్ మహాసభపై కాంగ్రెస్‌లో ఆందోళన పెరిగిందని, అందుకే అకస్మాత్తుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాల్లో ఆదివారం జాబ్ మేళాలు నిర్వహించారని చెప్పారు. సభ నిర్వహణకు భూములు ఇచ్చిన ఎల్కతుర్తి, చింతపల్లి రైతులు, భాగస్వామ్యమైన మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల గుండెల్లో కేసీఆర్‌కు చెరగని ముద్ర ఉందని.. రజతోత్సవ సభ నిరూపించిందని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ఒకే ఒక్కడిగా బయలుదేరిన కేసీఆర్ 14 ఏండ్లు తెలంగాణ అంతటా కలియ తిరిగి సమస్యలను గుర్తించి రాష్ట్ర ఏర్పాటు తర్వాత వాటిని పరిష్కరించారని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లాలో సభను నిర్వహించేందుకు సహకరించిన కెప్టెన్ లక్ష్మీకాంతారావు కుటుంబ సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక సభలకు వేదికగా ఉన్న వరంగల్.. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభతో మరోసారి ఈ పరంపరను కొనసాగించిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సభను విఫలం చేసేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెప్పుపెట్టులాగా తెలంగాణ ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేశారని చెప్పారు. సభలో కేసీఆర్ ప్రసంగం పూర్తయి 5 నిమిషాలు కాక ముందే మంత్రులు పొంగులేటి, సీతక్క, జూపల్లి సిగ్గులేకుండా ప్రెస్‌మీట్ పెట్టారని విమర్శించారు. రాజకీయ పార్టీ పుట్టిన రోజు జరుపుకుంటే దానికి వ్యతిరేకంగా మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ములుగు రోడ్డు వద్ద బస్సుల్లో వెళ్తున్న వారిని ఆర్టీవో అధికారులు ఆపి ఎండలో నిల్చోబెట్టారని, టోల్ గేట్‌ల వద్ద కావాలని ఆపారని ధ్వజమెత్తారు.

తెలంగాణ ప్రజలంటే విస్కీ బాటిళ్లా?

- **బీఆర్ఎస్ సభ సక్సెస్‌పై ఎందుకంత అక్కసు?**
- **పీసీసీ చీఫ్, సీఎంలవి ఓర్వలేని ఆరోపణలు**
- **పాలన చేతకాక విపక్షంపై నోరు పారేసుకుంటున్నారు**
- **ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్వజం**

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 28: ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో విస్కీ బాటిళ్లే కనిపించాయని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలపై ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రజలంటే విస్కీ బాటిళ్లా? ఇసుకేస్తే రాలనంతగా వచ్చిన లక్షలాది మంది కనిపించలేదా? ఇది కాంగ్రెస్ కండకావరమా? లేక అధికార మదమా? అని సోమవారం ఓ ప్రకటనలో నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ సభ సక్సెస్‌పై కాంగ్రెస్‌కు ఎందుకంత అక్కసు అని మండిపడ్డారు. వరంగల్‌లో బీఆర్ఎస్ జనసునామీతో కాంగ్రెస్ సర్కారులో వణుకు మొదలైందని చెప్పారు. ఈ సభ ద్వారా పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ భయాన్ని పరిచయం చేసిందని వ్యాఖ్యానించారు. పాలన చేతకాక విపక్షంపై నోరు పారేసుకుంటున్నారని, వారికి కేసీఆర్‌ను విమర్శించే స్థాయిలేదని తెలిపారు. ప్రజలను విస్కీబాటిళ్లతో పోల్చిన పీసీసీ అధ్యక్షుడు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సంబురం అనగానే కాంగ్రెస్ సర్కారు కండ్లలో నిప్పులు పోసుకుందని, సభ జరగకుండా కుట్రలు చేసిందని మండిపడ్డారు. తండోపతండాలుగా తరలివచ్చిన సబ్బండ వర్గాలు, బీఆర్ఎస్ శ్రేణులు గులాబీ జెండా పవర్ చూపించారని తెలిపారు.

రేవంత్ దుష్పరిపాలనకు రెఫరెండమే సభ

- **బీఆర్ఎస్ రజతోత్సవం.. చరిత్రాత్మకం**
- **కేసీఆర్‌పై విశ్వాసానికి జనమే సాక్ష్యం**
- **మంత్రులు ఆత్మవిమర్శ చేసుకోవాలి**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్**

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తేతెలంగాణ): '17 నెలల రేవంత్ సర్కారు అరాచక పాలనకు బీఆర్ఎస్ రజతోత్సవ సభ రెఫరెండమే.. భవిష్యత్తులో ప్రజా తిరుగుబాటుకు ఇదే సంకేతం' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రదాత కేసీఆర్‌పై ఉన్న విశ్వాసం, గౌరవానికి లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలే నిదర్శమని పేర్కొన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం బీఆర్ఎస్ నేతలు కిశోర్‌గౌడ్, కురువ విజయ్, ఉపేంద్రాచారితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్కతుర్తి వేదికగా బీఆర్ఎస్ నిర్వహించిన బాహుబలి సభ చరిత్రాత్మకమని అభివర్ణించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కొలువైన కేసీఆర్‌ను చూసి, ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలంతా కదిలిరావడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ సభ కాంగ్రెస్‌కు ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందే ఉన్నదని హెచ్చరించారు.

కేసీఆర్ పేరెత్తలేదని రేవంత్ అలక

కేసీఆర్ మీటింగ్‌కు వచ్చిన ప్రజలను చూసి కాంగ్రెస్ పెద్దలు, మంత్రుల కాళ్ల కింద భూమి బద్దలైందని, వారి వెన్నులో వణుకు పుట్టిందని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. సభలో కేసీఆర్ తన పేరు ఎత్తలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఇంట్లో అన్నం తినకుండా అలిగి పడుకున్నారని వ్యంగ్యాస్త్రం సంధించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమల్లో విఫలమయ్యామని సీఎం, మంత్రులు ఆత్మవిమర్శ చేసుకోకుండా కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ ఆరోపణలు అవాస్తవమైతే మంత్రులు పొంగులేటి, పొన్నం, సీతక్క జూపల్లి మహా అంబేద్కర్ విగ్రహం వద్ద ముక్కు నేలకు రాసేందుకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. మున్ముందు కాంగ్రెస్ భరతం పడతామని హెచ్చరించారు.

తెలంగాణ భావోద్వేగ సోపతి

ఎల్కతుర్తి సభలో అలరించిన దేశపతి విరచిత దృశ్యం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): 'ప్రజాశక్తినే ప్రదర్శించిన బహిరంగ సభల చేతనం' అని బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఎమ్మెల్సీ, కవిగాయకుడు దేశపతి శ్రీనివాస్ రాసిన పాట ఆదివారం ఎల్కతుర్తి సభలో మారుమోగింది. 'చరిత్ర కడుపున పుట్టిందీ ఉద్యమాగ్ని శిశువూ.. అది తెలంగాణ తలరాతను మార్చిన నవవసంత రుతువూ' అని ఈ పాట మొదలవుతుంది. ఆ పాటకు అనుగుణమైన దృశ్యాలు తెలంగాణ ఆత్మగౌరవం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో సాగిన పోరాటాన్ని కండ్లముందు ఉంచింది. తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచీ పార్టీ అధినేత కేసీఆర్ వెన్నంటే నిలిచిన దేశపతి.. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వికాసాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ నేతృత్వంలో ప్రగతి పరుగుల చరిత్రను ఆ పాటలో దృశ్యమానం చేశారు. రజతోత్సవ వేదికకు కేసీఆర్ వచ్చేముందు ప్రదర్శితమైన ఆ పాట, పాట నేపథ్యంగా ఉద్యమ దృశ్యాలు సభికులను ఒకింత భావోద్వేగానికి లోనుచేశాయి. వీడియో ప్రదర్శన పూర్తికాగానే సభా ప్రాంగణం అంతా 'జై బీఆర్ఎస్.. జై తెలంగాణ.. జైజై తెలంగాణ' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఒక్కసారిగా పిడికెళ్లెత్తి పలకడం విశేషం.

మళ్లీ కేసీఆర్ వైపే చూస్తున్న ప్రజలు

ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తేతెలంగాణ): ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తెలంగాణ నలుమూలల నుంచి లక్షలాది మంది తరలివచ్చారని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభతో తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు చూస్తున్నారనే విషయం రుజువైందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం తొణికిసలాడుతున్నదని తెలిపారు. 14 ఏండ్లు ఉద్యమం, పదేండ్లు అధికారం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్ష పాత్రలో ప్రజలకు అందించిన సేవలకు లభించిన ప్రతిఫలంగానే జనం ఈ సభకు తరలివచ్చారని అభివర్ణించారు. పెద్దసంఖ్యలో తరలివెళ్లిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు, విజయవంతానికి కృషి చేసిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దండకారణ్యంలో ఎదురుకాల్పులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 28 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ప్రాథమిక వివరాల ప్రకారం.. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో వారం రోజులుగా సెర్చింగ్ ఆపరేషన్, మూడు రోజుల క్రితం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. సోమవారం సాయంత్రం బీజాపూర్ జిల్లా నడిపల్లి-గల్గామ్ మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టులు జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు మావోయిస్టులున్న ప్రాంతాన్ని చుట్టుముట్టి ఎదురుకాల్పులు చేశారు. పూర్తి వివరాలను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

24 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట 24 మంది మావోయిస్టులు సోమవారం లొంగిపోయారు. వారిలో 14 మందిపై రూ.28.50 లక్షల రివార్డు ఉన్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

పోలీసుల్లో అంతర్మథనం!

- **కేసీఆర్ వార్నింగ్‌తో ఆలోచనలో పడ్డ పోలీసులు**
- **మనకెందుకు.. మన డ్యూటీ మనం చేద్దామనే భావన**
- **ఏకపక్షంగా ఉంటే భవిష్యత్‌కు ప్రమాదమనే ఆందోళన**
- **కేసీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసు వర్గాల్లో చర్చ**

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిన్నరగా ఏకపక్షంగా వ్యవహరిస్తూ.. కాంగ్రెస్ నేతలు చెప్పినట్టుగా నడుచుకుంటున్న పోలీసుల్లో కేసీఆర్ ఇచ్చిన ఒక్క వార్నింగ్‌తో అంతర్మథనం మొదలైంది. నీతి, న్యాయం లేకుండా, అన్యాయమో, అక్రమమో చూడకుండా ఇష్టారీతిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై కేసులు బుక్ చేస్తే రాబోయే రోజుల్లో పరిస్థితులు చాలా దారుణంగా ఉంటాయని పరోక్షంగా కేసీఆర్ హెచ్చరించడంతో పోలీసులు ఆలోచనలో పడ్డారు. ఎల్కతుర్తి మహాసభలో కేసీఆర్ మాట్లాడుతూ.. 'ఒక్క మాట పోలీసు మిత్రులకు మనవి చేస్తున్నా.. ప్రజాస్వామ్యంలో ప్రజలకు అడిగే హక్కు ఉంటది. ప్రజలు అడుగుతారు. అడిగే హక్కును సోషల్‌మీడియాలో కూడా కాలరాస్తున్నారు. ప్రశ్నించినవారిపై కేసులు, వాళ్లను పట్టుకొనిపోవుడు. పోలీసు సోదరులను నేను అడుగున్నా.. మీరెందుకు దునుకులాడుతన్నరు? మీకేం అక్కరొచ్చింది? ఈ రాత్రి మీరు మీ డైరీల్లో రాసుకోండి. మల్లా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. దానిని ఆపడం ఎవరితరం కాదు. మీకు తెల్వదా? మీరు చదువుకోలేదా? ప్రజాస్వామ్యంలో అడిగే హక్కు లేదా? మీరెందుకు కేసులు పెడుతున్నరు? రేపు మీరెందుకు బలవుతరు? మీకు రాజకీయాలెందుకు? మీ డ్యూటీ మీరు చెయ్యండి. బీఆర్ఎస్ ఎప్పుడూ శాసనాన్ని ఉల్లంఘించదు. చట్టాలను ఉల్లంఘించం' అని లక్షలాది జనసమూహం ఎదుట అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న కొందరు పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. పదేండ్లపాటు శాంతిభద్రతల విషయంలో రాజీ పడకుండా పాలన సాగించిన కేసీఆర్ అంతటి వ్యక్తే.. స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వడంతో కొందరిలో మార్పు మొదలైంది. కేసీఆర్ చెప్పిన ఆ మాటలను ఎంతోమంది తమ వాట్సాప్ స్టేటస్‌లుగా పెట్టుకోవడంతో.. ఆయన చెప్పిన అంశం ప్రజల్లోకి బాగా వెళ్లింది. దీంతో 'మనకెందుకు.. మన డ్యూటీ మనం చేసుకుందాం. ఇకనుంచి ఏదైనా చట్టపరంగానే చేద్దాం' అంటూ పలువురు పోలీసులు మాట్లాడుకుంటున్నారు. 'డిపార్ట్‌మెంట్‌లో కొందరు అతి చేయడం వల్లనే ఇట్లాంటి వార్నింగ్‌లు వినాల్సి వస్తున్నది' అని కొందరు సిన్సియర్ ఆఫీసర్లు చెప్తున్నారు. మొత్తానికి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని భావిస్తున్న కొందరు పోలీసులు.. ఏకపక్షంగా ఉంటే భవిష్యత్‌ను నాశనం చేసుకోవడమేనని ధోరణికి వచ్చారు. ఒక పార్టీకే సపోర్ట్ చేస్తే.. నాన్ ఫోకల్‌లోనే ఉండాల్సి రావొచ్చని భయపడుతున్నారు. ఎల్కతుర్తి వేదికగా కేసీఆర్ ఇచ్చిన వార్నింగ్‌తో పోలీసుల్లో అంతర్మథనం మొదలైంది.

అవును నిజమే

> మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్:	పని శాతనైతలేదా?
రైతు:	అయితలేదు.
కేసీఆర్:	రైతులు మల్లా తెల్లారంగ పోవాల్నా మోటర్లు పెట్టనీకి.
రైతు:	అవును.
కేసీఆర్:	ఏం దౌర్భాగ్యం ఇది.
రైతు:	వాళ్లు పోతేనే భాగ్యం.. మల్ల కేసీఆర్ వస్తేనే మా కష్టాలు పోతయి.
కేసీఆర్:	భూముల ధరలు ఎటుపోయినయి.
రైతు:	పొయినయ్.
కేసీఆర్:	కరంటు ఎవడు ఎత్తుకపోయిండు?
రైతు:	దొంగలు.. ఎనుక నుంచి ఎత్తుకపోయింండ్రు.

ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఇది ఆ ఒక్క రైతు స్పందనే కాదు.. ఎల్కతుర్తి సభకొచ్చిన లక్షలాది మంది రైతుల స్పందన. వారే కాదు.. యువత, మహిళలు, పెద్దలు, వృద్ధులు.. కేసీఆర్ ప్రసంగానికి ఫిదా అయ్యారు. సమైక్య పాలనలో ఈ ప్రాంతం ఎలా వివక్షకు గురైందో, ఎందుకు ఉద్యమం ఎత్తుకోవాల్సి వచ్చిందో చెప్పినప్పుడు నాటి పరిస్థితులను తలుచుకొని వారి గుండెలు బరువెక్కాయి. 'ఎట్లుండే నా తెలంగాణ.. ఎట్లయింది నా తెలంగాణ' అనుకుంటూ మథనపడ్డారు. తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధి చెందిన తీరును ప్రత్యక్షంగా చూసిన కండ్లతోనే, 16 నెలలుగా జరుగుతున్న విధ్వంసాన్ని చూస్తూ నిస్సహాయంగా ఉండిపోయిన ప్రజలకు ఎల్కతుర్తి సభతో భవిష్యత్తుపై ఆశలు చిగురించాయి.

ఎల్కతుర్తిలో దుమ్మురేపిన 'ధూంధాం'

- **రసమయి బాలకిషన్ సారథ్యంలో అలరించిన ఆటాపాట**
- **ప్రజలను ఉర్రూత లూగించిన కళా ప్రదర్శనలు**
- **ఎర్రటి ఎండలో ఉత్తేజం నింపిన ధూంధాం పాటలు**

ఎల్కతుర్తి సభా వేదికపై పాటతో సభికుల్లో ఉత్తేజం నింపుతున్న రసమయి, కళాకారులు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): 'జబ్బకు జెండా చేతుల జెండా జాతర పోదమా.. గులాబీ జాతర పోదమా..', 'మన అన్న కేసీఆరూ రామక.. ఎంత మంచిపనులు జేసే రామక..' అన్న పాటలే కాక మరెన్నో ఉత్తేజితమైన ఆటాపాటలతో ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ అలరించింది. ఎర్రటి ఎండలో ఎల్కతుర్తిని ఎగురవేసి ధూంధాం చేశాయి. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటిదాకా తెలంగాణే కేసీఆర్‌గా, కేసీఆరే తెలంగాణగా నడిచొచ్చిన దారిని, మలుపుతిప్పిన మార్గాలను ఆటపాటలతో కళాకారులు ప్రజలను ఆలోచింపజేశారు. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి మాజీ చైర్మన్ రసమయి బాలకిషన్ సారథ్యంలోని కళాకారుల బృందం నిర్వహించిన తెలంగాణ ధూంధాం లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలకు ఎండ తీవ్రత తీవ్రత తెలియకుండా చేసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఆటపాటలు సభాప్రాంగణానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వచ్చేదాకా నాలుగు గంటలపాటు నిర్విరామంగా కొనసాగాయి. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభాప్రాంగణానికి చేరుకోగానే ఆలపించిన 'గులాబీ జెండాకు గుండెబలం అన్నా కేటీఆరూ, జై రామన్నా.. జై జై రామన్నా' అంటూ కళాకారులు పాట అందుకోగానే సభాప్రాంగణం యువత కేరింతలతో దద్దరిల్లిపోయింది. తెలంగాణ ఆటాపాటలతో పరుగులు పెట్టే తెలంగాణ జీవధార అని ఎల్కతుర్తి సభ మరోసారి నిరూపించింది.